బీఆర్ఎస్ గురించి మాట్లాడే హక్కు లేదు

రైతుబంధు సమితి రాష్ట్ర మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న రాయిడి రవీందర్‌రెడ్డి

నర్సంపేట, జనవరి 18: అరాచకాలు, బ్లాక్‌మెయిల్ రాజకీయాలతో పబ్బం గడుపుతున్న కాంగ్రెస్ నేతలకు బీఆర్ఎస్ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని రైతుబంధు సమితి రాష్ట్ర మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్‌రెడ్డి హెచ్చరించారు. పట్టణంలో శనివారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ నేతల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరాత చోటామోట నాయకులు వ్యాపార, వాణిజ్య, సామాన్య ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ అధికారులను అదుపులో పెట్టుకొని సెటిల్‌మెంట్లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తప్పులు చేస్తున్న కాంగ్రెస్ నేతలు బీఆర్ఎస్ గురించి మాట్లాడడం వారి మూర్ఖత్వానికి నిదర్శనన్నారు. పట్టణంలోని మాదన్నపేట రోడ్, మల్లంపల్లి రోడ్‌లోని సర్వే నంబర్ 111లో సుమారు 2,800 ఎకరాల విస్తీర్ణంలో 40 ఏళ్ల క్రితం ప్రజలు ఇళ్లు నిర్మించుకొని వాణిజ్య, వ్యాపారాలు చేసుకుంటున్నారని గుర్తుచేశారు. వీరికి రక్షణ కల్పించాల్సిన పాలకులు వ్యాపారులను బ్లాక్‌మెయిల్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఇటీవల మల్లంపల్లి రోడ్‌లోని ఏజెన్సీ ప్రాంతమైన రాజుపేట శివారులో 117/1/15–బీలో 2 ఎకరాల స్థలాన్ని కొనుగోలు చేసి వెంచర్ చేసిన అతడికి ప్రభుత్వ నిబంధనలు వర్తించవా అని ప్రశ్నించారు. నర్సంపేట పట్టణాభివృద్ధిలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రధాన భూమిక పోషించారని గుర్తుచేశారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజ్, పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి, నాయకులు డాక్టర్ లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, యువజన పట్టణ అధ్యక్షుడు రాయిడి కీర్తి–దుష్యంత్‌రెడ్డి, కౌన్సిలర్లు తిరుమల–సదానందం, గందె శ్రీలత–చంద్రమౌళి, రామసహా యం శ్రీదేవి–సుధాకర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ మండల శ్రీనివాస్, బండి రమేశ్, రావుల సతీశ్, చుక్క అనిల్, మద్దెల సాంబయ్య, సంపంగి సాలయ్య, పల్నాటి సాంబయ్య, దొమ్మటి సంతోష్, సందీప్ పాల్గొన్నారు.

కూలీలందరికీ ‘ఆత్మీయ భరోసా’ ఇవ్వాలి

- మ్యానిఫెస్టోలో ప్రకటించిన విధంగా రూ. 12 వేలు అందించాలి
- 80 శాతం మంది రైతులకు అందని బోనస్
- యాసంగి సాగు ప్రారంభమైనా అందని పెట్టుబడి సాయం
- బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య

ఖానాపురం: బీఆర్ఎస్ విస్తృత సమావేశంలో మాట్లాడుతున్న మహాలక్ష్మి వెంకటనర్సయ్య

ఖానాపురం, జనవరి 18: జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఉపాధిహామీ కూలీకీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని వర్తింపజేయాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహాలక్ష్మి వెంకటనర్సయ్య డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో శనివారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధిహామీ కూలీలకు ఏడాదికి రూ. 12 వేలు అందజేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిందని గుర్తుచేశారు. ఏడాది గడిచినా పథకం ఊసే లేదని ఎద్దేవా చేశారు. స్థానిక సంస్థ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రభుత్వం తూతూ మంత్రంగా ఉపాధికూలీలకు కేవలం రూ. 6 వేలు వారి ఖాతాల్లో జమ చేస్తామని చెప్పడం హాస్యాస్పదమన్నారు. మండలంలో జాబ్‌కార్డు కలిగిన వారు 8 వేల మంది ఉన్నారన్నారు. పనిదినాల పేరుతో కేవలం 10 శాతం కూలీలకే పథకాన్ని వర్తింపజేసేందుకు పాలకులు కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. గుంట భూమి, జాబ్ కార్డు లేనివారు మండలంలో 2 వేలకు పైగా ఉన్నారన్నారు. వారికి కూడా పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సన్న ధాన్యానికి బోనస్ పథకాన్ని ప్రభుత్వం బోగస్‌గా మార్చిందని ఎద్దేవా చేశారు. మండలంలో ఇప్పటివరకు కేవలం 20 శాతం మంది రైతులకే బోనస్ అందిందన్నారు. 80 శాతం మంది రైతులు బోనస్ కోసం ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాకాల ఆయకట్టులో యాసంగి పనులు ప్రారంభమైనా పెట్టుబడి కోసం రైతులు ఎదురుచూస్తున్నారని తెలిపారు. రైతు భరోసా పథకంలో ప్రభుత్వం రైతులకు ఎకరానికి రూ. 17,500 బాకీ ఉందని గుర్తుచేశారు. ఇప్పుడు ఎకరానికి రూ. 6 వేలు ఇస్తామంటున్న ప్రభుత్వం.. మిగిలిన రూ. 11,500 ఎప్పుడు ఇస్తుందో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులకు ప్రభుత్వం మొండిచేయి చూపిందన్నారు. ఈ నెల 21 నుంచి జరగనున్న గ్రామసభల్లో రైతులు, కూలీలు, కౌలు రైతులు ప్రభుత్వాన్ని ఎక్కడికక్కడ నిలదీయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోత్ రామస్వామి నాయక్, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, సొసైటీ వైస్ చైర్మన్ దేవినేని వేణుకృష్ణ, మాజీ సర్పంచ్ కాస ప్రవీణ్‌కుమార్, షేక్ మౌలానా, మాజీ వైస్ ఎంపీపీ జాటోత్ బాలునాయక్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు మచ్చిక అశోక్, సొసైటీ డైరెక్టర్లు ఆబోత్ అశోక్, రాజు, గుగులోత్ బాలునాయక్ పాల్గొన్నారు.

అందరికీ రైతు భరోసా ఇవ్వాలి

గీసుగొండ: జాబ్‌కార్డులు ఉన్న ప్రతి కూలీకి రూ. 12 వేల ఆర్థిక సాయం అందించాలని మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ మండల నాయకుడు బోడకుంట్ల ప్రకాశ్ డిమాండ్ చేశారు. మండలంలోని మచ్చాపురంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో భూమితో సంబంధం లేకుండా జాబ్‌కార్డులు ఉన్నవారందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ. 12 వేలు ఇస్తామని చెప్పిందన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మాట మార్చడం దారుణమన్నారు. ఆరు గ్యారెంటీలను పూర్తిగా అమలు చేయకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తున్నదని ఎద్దేవా చేశారు. ప్రజల సమస్యల పరిష్కారం కోసం ప్రశ్నించే బీఆర్ఎస్ నేతలు ఎవరికీ భయపడరని హెచ్చరించారు.

వెంటనే రైతు భరోసా డబ్బులు చెల్లించాలి

నర్సంపేట: రైతులకు ఎకరానికి రూ. 17,500 బాకీ ఉన్న రైతు భరోసా డబ్బులను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే చెల్లించాలని బీఆర్ఎస్ నర్సంపేట మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు పెట్టుబడి సాయం రూ. 15 వేలు ఇస్తామని చెప్పి, ఇప్పుడు రూ. 12 వేలు చెల్లిస్తామని చెప్పడం రైతాంగాన్ని మోసం చేయడమేనని ధ్వజమెత్తారు. రైతు భరోసా బాకీలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు, క్లస్టర్ ఇన్‌చార్జీలు మోతె పద్మనాభరెడ్డి, కోమాండ్ల గోపాల్‌రెడ్డి, మచ్చిక నర్సయ్యగౌడ్, మోతె జయపాల్ రెడ్డి, మోటూరి రవి, తాళ్లపెల్లి రాంప్రసాద్, కందుల రాజిరెడ్డి, కడారి కుమారస్వామి, కట్ల సుదర్శన్‌రెడ్డి, భూక్యా వీరన్న, సర్పంచ్‌ల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు కొడారి రవన్న, నాయకులు పాల్గొన్నారు.

కార్మికులందరికీ ఆత్మీయ భరోసా కల్పించాలి

పోచమ్మమైదాన్: వ్యవసాయ కార్మికులందరికీ ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కల్పించాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో కోరారు. అర్హులైన వ్యవసాయ కూలీలందరికీ ఏడాదికి రూ. 12 వేలు అందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి కొర్రీలు పెట్టొద్దని కోరారు.

బాబాకు చాదర్ సమర్పిస్తున్న సీపీ అంబర్ కిశోర్ ఝా

మతసామరాస్యానికి ప్రతీక బాబా దర్గా

వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా

పర్వతగిరి(రాయపర్తి), జనవరి 18: మతసామరాస్యానికి ప్రతీకగా పర్వతగిరి మండలంలోని అన్నారం షరీఫ్ హజ్రత్ సయ్యద్ యాకూబ్‌షావలీ బాబా దర్గా నిలుస్తుందని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అన్నారు. దర్గా ఉత్సవాలకు శనివారం సీపీ హాజరై చాదర్ సమర్పించారు. ఉత్సవాల్లో అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపట్టామని ఆయన అన్నారు. కార్యక్రమంలో మామూనూరు ఏసీపీ తిరుపతి, సీఐ రాజగోపాల్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, కో ఆప్షన్ మాజీ సభ్యుడు మహ్మద్ షబ్బీర్, జడల కృష్ణ, ముజావర్లు పాల్గొన్నారు. అనంతరం సీపీ అంబర్ కిశోర్ ఝా పర్వతగిరి పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. రిజిస్టర్లు, రికార్డులు, నేరాల వివరాలను తెలుసుకున్నారు. స్టేషన్ ఆవరణలోని పరిసరాలు, గదులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు.

పాకాలలో సీసీరోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న డీఎఫ్‌వో

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

ఖానాపురం, జనవరి 18: అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని వరంగల్ డీఎఫ్‌వో అనూజ్ అగర్వాల్ అన్నారు. నర్సంపేట ఎఫ్ఆర్వో రవికిరణ్‌తో కలిసి శనివారం ఆయన పాకాలలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. అదేవిధంగా సరస్సులో బోటింగ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాకాలలో సీసీ రోడ్ల నిర్మాణం, సీతాకోకచిలుకల పార్కు ఫెన్సింగ్ నిర్మాణం, బోటింగ్ పాయింట్ నిర్మాణం చేపట్టామన్నారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. అధికారులు నిత్యం పనులను పర్యవేక్షించాలని ఆదేశించారు. నాణ్యతలో లోపాలుంటే చర్యలు తీసుకుంటామని కాంట్రాక్టర్‌ను హెచ్చరించారు. ఆయన వెంట డీఆర్వో రీనా, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు గడువులోగా పూర్తి చేయాలి

కలెక్టర్ సత్యశారద


మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

కాశీబుగ్గ, జనవరి 18: జిల్లాలో చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి పనులను గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. శనివారం ఆమె కలెక్టర్ కార్యాలయంలో పనుల పురోగతిపై అదనపు కలెక్టర్ జి.సంధ్యారాణి, డీఆర్వో విజయలక్ష్మి, డీఈవో జగదీశ్వర్, ఎంఈవోలతో సమీక్షించారు. జిల్లాలో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులు పూర్తయి ఎంబీలతోపాటు పనులకు ముందు, తర్వాత తీసిన ఫొటోలను జియో ట్యాగింగ్ చేయాలన్నారు. జిల్లాలో మంజూరైన 1208 పనులకు 199 పెండింగ్‌లో ఉన్నాయని, రెండు రోజుల్లో పూర్తి చేసి అడ్మినిస్ట్రేషన్ మంజూరుకు పంపించాలని అధికారులకు సూచించారు. సమీక్షలో ఈఈపీఆర్ ఇజ్జగిరి, అమ్మ ఆదర్శ పాఠశాలల ప్లానింగ్ కోఆర్డినేటర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే, కలెక్టర్ వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లోని గోదాములను అదనపు కలెక్టర్‌తో కలిసి పరిశీలించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూంను పరిశీలించారు. వారి వెంట తహసీల్దార్ ఇక్బాల్, నాయబ్ తహసీల్దార్ రంజిత్, మార్కెట్ కమిటీ కార్యదర్శి పోలెపాక నిర్మల ఉన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్

రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై రాష్ట్ర నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సమాచార పౌర సంబంధాల శాఖ, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ, జౌళి, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీఎస్ శాంతి కుమారితో కలిసి కలెక్టర్లతో శనివారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఎస్‌సీడీవో కృష్ణయ్య, డీఏవో అనురాధ, బల్దియా అదనపు కమిషనర్ జోనా తదితరులు పాల్గొన్నారు.

దీప్తికి ప్రముఖుల అభినందన

పర్వతగిరి(రాయపర్తి), జనవరి 18: పర్వతగిరి మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన క్రీడాకారిణి జీవాంజీ దీప్తి శనివారం ప్రముఖుల నుంచి అభినందనలు అందుకున్నారు. ఓరుగల్లు దీప్తి... అర్జున కీర్తి అంటూ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రశంసల వర్షం కురిపించడంతోపాటు దీప్తి తమ మండలంలో జన్మించడం ఎంతో సంతోషంగా ఉందని ఒక ప్రకటనలో కొనియాడారు. అదేవిధంగా దీప్తి అర్జున అవార్డు అందుకున్న సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అభినందించారు. దీప్తికి జిల్లాలోని ప్రభుత్వ అధికారులు, అఖిల పక్ష రాజకీయ నాయకులతో పాటు సబ్బండ వర్గాల ప్రజలు అభినందనలు తెలిపారు.

పంట కాల్వలో మొసలి ప్రత్యక్షం


సేదతీరుతున్న మొసలిపిల్ల

ఖానాపురం, జనవరి 18: మండలంలోని పెద్దమ్మగడ్డ శివారు సంగెం కాల్వలో పాలెల్లి జానయ్య మాటు ఒడ్డుపై శనివారం మొసలిపిల్ల ప్రత్యక్షమైంది. దీంతో యాసంగి పనులకు పొలాల వద్దకు వెళ్లిన రైతులు ఆందోళనకు గురయ్యారు. కొద్ది సేపు ఒడ్డున సేదతీరిన మొసలిపిల్ల మనుషుల అలికిడికి పంట కాల్వలోకి జారుకుంది. పాకాల పంట కాల్వల్లో తరచూ మొసళ్లు దర్శనమిస్తుండడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. మొసళ్లను పట్టుకొని సరస్సులో వదిలిపెట్టాలని రైతులు అటవీ శాఖ అధికారులను కోరుతున్నారు.

విద్యార్థి సంఘాల ఆందోళన

నర్సంపేట, జనవరి 18: ఆక్రమణకు గురవుతున్న పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలాన్ని శనివారం నర్సంపేట ఆర్డీవో ఉమారాణి పరిశీలించారు. తహసీల్దార్ రాజేశ్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదుట ఏబీవీఎస్‌ఎఫ్, బీఆర్‌ఎస్వీ, ఎంఎస్‌ఎఫ్, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సుమారు 18 ఎకరాల విస్తీర్ణం ఉన్న కళాశాల స్థలాన్ని కొన్ని రోజుల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు జేసీబీతో చదును చేయించారని నాయకులు తెలిపారు. స్థలాన్ని ఆక్రమిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాలో విద్యార్థి సంఘాల నాయకులు దేవోజు హేమంత్, బొట్ల నరేశ్, సదిరం వినయ్, మహేందర్, చింతం సిద్ధూ, ప్రశాంత్, వినయ్, రంజిత్, రమ్య, శ్రీలేఖ, రఘు, చిరంజీవి, ప్రసాద్ పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

సంగెం/చెన్నారావుపేట, జనవరి 17: గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. సంగెం మండలంలోని చింతలపల్లి, వాళునాయక్‌తండా, ఎల్గూర్‌స్టేషన్‌లో గుడుంబా తయారీ చేస్తున్నట్లు తెలుసుకున్న ఎక్సైజ్ పోలీసులు శనివారం దాడులు చేశారు. ఈ సందర్భంగా 40 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని, 1200 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. బాదావత్ రాధ, బాదావత్ రాజేశ్‌పై కేసు నమోదు చేశారు. దాడుల్లో సీఐ స్వరూప, జిల్లా టాస్క్‌ఫోర్స్ సీఐ రమేశ్‌చందర్, ఎస్సై సరిత పాల్గొన్నారు. అలాగే, చెన్నారావుపేట మండలం తోపన్‌గడ్డ తండాలో సారాను పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి తెలిపారు. తోపన్‌గడ్డతండా, ఇందియాతండాలో 16 లీటర్ల సారా, 400 లీటర్ల చక్కెర పాకాన్ని ధ్వంసం చేసినట్లు సీఐ తెలిపారు. అనంతరం బోడ బుజ్జి, లకావత్ రేణుక, గుగులోత్ వెంకన్న, భూక్యా రమేశ్‌పై కేసు నమోదు చేశామన్నారు.

‘నా భూమి ఇప్పించండి’

గీసుగొండ, జనవరి 18: తన భూమిని ఇప్పించాలని బాధితురాలు పోలీసులను కోరింది. ఎలుకుర్తికి చెందిన అల్లూరి ప్రేమలీల కథనం ప్రకారం.. తన రెండెకరాల వ్యవసాయ భూమిని గ్రామానికి చెందిన తిప్పారపు వీరమ్మకు రూ. 16 లక్షలకు అమ్మేందుకు పెద్ద మనుషుల సమక్షంలో అగ్రిమెంటు చేసుకున్నారు. బయానగా ప్రేమలీలకు రూ. 5 లక్షలు చెల్లించారు. మిగతా డబ్బులు ఇవ్వకుండానే వీరమ్మ పంట సాగు చేస్తున్నది. దీంతో పెద్దమనుషులను సంప్రదించగా, వారు పలుమార్లు పంచాయితీ పెట్టినా డబ్బు లు ఇవ్వకుండా వీరమ్మ ఇబ్బంది పెడుతున్నది. వారు ఇచ్చిన రూ. 5 లక్షలు తిరిగి ఇస్తానని, తన భూమిని ఇప్పించాలని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా న్యాయం జరగడం లేదని ప్రేమలీల ఆవేదన వ్యక్తం చేసింది. అధికారులు స్పందించి న్యాయం చేయాలని వేడుకుంటున్నది.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి : ఎస్సై

మట్టెవాడ, జనవరి 17: విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మట్టెవాడ ఎస్సై నవీన్ సూచించారు. మట్టెవాడ పరిధిలోని ఏవీవీ జూనియర్ కళాశాలలో మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు జాగృతి పోలీస్ కళా బృందం సభ్యులు అవగాహన కల్పించారు. విద్యార్థులు డ్రగ్స్, గుట్కాలకు దూరంగా ఉండి చదువుపై దృష్టి సారించాలని ఎస్సై సూచించారు. ఆపద సమయంలో డయల్ 100, షీటీం, సైబర్ హెల్ప్‌లైన్ నంబర్ 1930ని వినియోగించుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ సంజీవ్, సంపత్, నాగమణి, విజయ్‌కుమార్, బాబురావు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందించాలి

అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి


రాయపర్తి: పర్వతగిరి మండలంలో సర్వేను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో రాంరెడ్డి

దుగ్గొండి/కాశీబుగ్గ/రాయపర్తి/వర్ధన్నపేట/గీసుగొండ, జనవరి 18: అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరవేయాలని అడిషనల్ కలెక్టర్ సంధ్యారాణి అధికారులకు సూచించారు. శనివారం ఆమె దుగ్గొండి మండలంలోని పొనకల్‌లో సర్వేను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. గుట్టలు, లే అవుట్ వెంచర్లు, కెనాల్ వంటి వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని సూచించారు. అలాగే, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో వ్యవసాయం భూమి లేని, జాబ్‌కార్డు కలిగి కనీసం 20 రోజుల పనిదినాలు పూర్తి చేసిన కుటుంబాలను మాత్రమే ఎంపిక చేయాలని ఆదేశించారు. రేషన్‌కార్డు దరఖాస్తుదారుల కుటుంబ సభ్యుల వివరాలను తప్పులు లేకుండా నమోదు చేయాలని సూచించారు. వరంగల్ 3వ డివిజన్ కొత్తపేటలో వ్యవసాయ భూముల్లో చేసిన ప్లాట్లను ఆమె పరిశీలించారు. సర్వే బృందానికి సూచనలు చేశారు. పర్వతగిరి మండలంలోని చెరువు కొమ్ము తండాలో మండల స్థాయి అధికారుల బృందం చేస్తున్న ఇంటింటి సర్వేను జడ్పీ సీఈవో గూడూరు రాంరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అర్హులకు పథకాలు అందేలా అధికారులు నివేదికలు తయారు చేయాలని సూచించారు. వర్ధన్నపేట మండలంలోని కట్య్రాలలో మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వర్లు అధికారులు, సిబ్బందితో కలిసి సర్వే నిర్వహించారు. ఇందిరమ్మ గృహాలు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డుల జారీ కోసం సర్వే చేస్తున్నట్లు తెలిపారు. గీసుగొండ మండలం ధర్మారం శివారులోని ఓపెన్ వెంచర్లు, లేఅవుట్ ప్లాట్లను ఏవో హరిప్రసాద్‌బాబుతో కలిసి తహసీల్దార్ రియాజుద్దీన్ పరిశీలించారు. వెంచర్లు చేసిన భూములను పట్టాదారు పాస్‌పుస్తకాల నుంచి తొలగిస్తామని చెప్పారు. సంగెం మండలంలోని కుంటపల్లిలో సర్వేను మండల ప్రత్యేకాధికారి టి.రమేశ్ పరిశీలించారు.


కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న సందీప్‌రెడ్డి

కళాకారులకు ఓరుగల్లు పుట్టినిల్లు

పోచమ్మమైదాన్, జనవరి 18: ఓరుగల్లు కవులు, కళాకారులకు పుట్టినిల్లు అని, తాను కళామతల్లి బిడ్డగా ఇక్కడే పుట్టి పెరిగానని ప్రముఖ సినీ దర్శకుడు వంగా సందీప్‌రెడ్డి అన్నారు. వరంగల్ బ్యాంకు కాలనీకి చెందిన ప్రముఖ కవి, గేయ రచయిత గోళ్ల రాజేంద్రప్రసాద్ రచించిన ‘నా హృదయంలో నిదురించే చెలి’ కవిత సంపుటిని శనివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం సందీప్‌రెడ్డి మాట్లాడుతూ తాను తీసే సినిమాల్లో వరంగల్ కళాకారులకు అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రుద్రోజు నాగరాజు, పూర్ణచందర్, పున్నం పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న డీఐఈవో శ్రీధర్‌సుమన్

ప్రీ ఫైనల్ పరీక్షలు విధిగా నిర్వహించాలి

గిర్మాజీపేట, జనవరి 18: ఇంటర్ వార్షిక పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేస్తూ సోమవారం నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు విధిగా నిర్వహించాలని డీఐఈవో డాక్టర్ శ్రీధర్‌సుమన్ ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. కాశీబుగ్గలోని ప్రభుత్వ కళాశాలను శనివారం సందర్శించి ప్రయోగశాలలు, సీసీ కెమెరాల పనితీరు పరిశీలించారు. అనంతరం శ్రీధర్‌సుమన్ మాట్లాడుతూ ఫిబ్రవరి 3 నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో కళాశాలల యాజమాన్యాలు ప్రయోగశాలలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రాక్టికల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందన్నారు. పరీక్షల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రిన్సిపాళ్లను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు, డీఐఈవో కార్యాలయ సిబ్బంది రాజశేఖర్, కొలంబో పాల్గొన్నారు.

ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చాలి

కాశీబుగ్గ/నర్సంపేట, జనవరి 18: ఆటో డ్రైవర్లు సురక్షితంగా ప్రయాణికులను గమ్యం చేర్చాలని ఎంవీఐ జయపాల్‌రెడ్డి సూచించారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా శనివారం వరంగల్ రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఆటో డ్రైవర్లు, ప్రయాణికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జయపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు విధిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంవీఐ శోభన్‌బాబు, ఏఎంవీఐ ఉదయ్ పాల్గొన్నారు. అలాగే, రోడ్డు భద్రతా నియమాలపై చెన్నారావుపేట ఎస్సై రాజేశ్‌రెడ్డి ముగ్దుంపురం జయముఖి కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల నిర్వాహకుడు చంద్రశేఖర్ రెడ్డి, ప్రిన్సిపాల్ జానకి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

‘నాకు వ్యవసాయ రుణమాఫీ కాలేదు’

గీసుగొండ, జనవరి 18: తనకు రుణమాఫీ కాలేదని మండలంలోని అనంతారం గ్రామానికి చెందిన గద్దె సాంబశివరావు తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. 2019లో గ్రామానికి చెందిన గద్దె పుష్పావతి ఊకల్ రైతు సహకార సంఘంలో రూ. 45 వేల వ్యవసాయ రుణం తీసుకుంది. ఆమె 2021లో మృతి చెందింది. ప్రభుత్వం 2018 నుంచి తీసుకున్న రుణాలను మాఫీ చేస్తామని ప్రకటించింది. అయితే, తమకు అర్హత ఉన్నా రుణమాఫీ కాలేదని ఆమె కుమారుడు సాంబశివరావు చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారులకు తన తల్లి పుష్పావతి ఆధార్‌కార్డు, డెత్ సర్టిఫికెట్ సమర్పించినట్లు పేర్కొన్నారు. మాఫీ వర్తిస్తుందని వ్యవసాయ అధికారులు చెప్పినా మాఫీ కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

ప్రమాదకరంగా ఉన్న రోడ్లు : కార్పొరేటర్ రవి

కరీమాబాద్, జనవరి 18: నగరంలో అస్తవ్యస్త స్మార్ట్‌సిటీ రోడ్ల కారణంగా కాలనీల్లోని రహదారులు ప్రమాదకరంగా మారి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని 40వ డివిజన్ కార్పొరేటర్ మరపల్ల రవి అన్నారు. స్మార్ట్‌సిటీ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి శనివారం ఆయన డివిజన్‌లోని పలు కాలనీల్లో రోడ్లను పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న పనులను వెంటనే పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని రవి కోరారు. 20 రోజుల్లో పనులు పూర్తి చేస్తామని వారు తెలిపినట్లు కార్పొరేటర్ చెప్పారు.

పెద్దబోడు గుట్ట భూములపై సర్వే

‘నమస్తే’ కథనానికి స్పందన

సర్వే చేపడుతున్న రెవెన్యూ అధికారులు

నల్లబెల్లి, జనవరి 18: మండలంలోని నాగరాజుపల్లె శివారులో ఆక్రమణకు గురవుతున్న పెద్దబోడు గుట్ట భూములను తహసీల్దార్ మప్పు కృష్ణ, ఆర్ఐ కార్తీక్, సర్వేయర్ మల్లయ్య పరిశీలించారు. ఈ నెల 12న పెద్దబోడు గుట్టకు ఎసరు శీర్షికన ‘నమస్తే తెలంగాణ’లో కథనం ప్రచురితమైంది. ఈ సందర్భంగా అధికారులు శనివారం పెద్దబోడు గుట్టను సందర్శించారు. సర్వే నంబర్ 31, 33లో 12.17 ఎకరాలు భూమి ఉండగా, గత వీఆర్వోలతోపాటు అప్పటి తహసీల్దార్ ప్రైవేటు వ్యక్తులతో కుమ్మక్కై ఎలాంటి ఆధారాలు లేకుండానే పట్టాలు పంపిణీ చేసినట్లు సర్వే ద్వారా బట్టబయలైంది. అలాగే, సర్వే నంబర్ 33లో కుంటతోపాటు కట్టను సైతం ధ్వంసం చేసి కొంతమంది నేడు కాస్తు చేసుకుంటున్నట్లు సర్వేలో వెల్లడైందని ఆర్ఐ తెలిపారు. అప్పటి అధికారులు పదెకరాల భూమిని 20 ఎకరాలుగా చూపి వాస్తవ సర్వే నంబర్లకు బై నంబర్లు వేయడం వల్ల సర్వేకు ఆటంకంగా మారిందన్నారు. తహసీల్దార్ కృష్ణ మాట్లాడుతూ పెద్దబోడు గుట్టను ఆక్రమించిన ఐదుగురికి నోటీసులు జారీ చేశామనని, సర్వే నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు.

బాధిత కుటుంబానికి మిత్రుల చేయూత



డిపాజిట్ పత్రాలు అందజేస్తున్న స్నేహితులు

సంగెం, జనవరి 18: మండలంలోని పల్లార్‌గూడకు చెందిన విద్యుద్ ఆర్టిజన్ కార్మికుడు గుగులోత్ కృష్ణ ఇటీవల విద్యుదాఘాతంతో మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కృష్ణతో కలిసి భద్రాచలంలోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుకున్న తోటి క్లాస్‌మేట్స్‌తో పాటు పూర్వ విద్యార్థులు రూ. లక్ష ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి మృతుడి భార్యాపిల్లలకు శనివారం అందజేశారు. కార్యక్రమంలో కోట దామోదర్, రాజు, స్నేహితులు పాల్గొన్నారు. అలాగే, పల్లార్‌గూడకు చెందిన గౌడ సంఘం సభ్యుడు, రేషన్ డీలర్ కక్కెర్ల సమ్మయ్య ఇటీవల మృతి చెందగా, గౌడ సంఘం సభ్యులు రూ. 10 వేల ఆర్థిక సాయం అందజేశారు. సంఘం సభ్యులు కుమారస్వామి, దామోదర్, కోటేశం, అశోక్, కృష్ణ, శివ, సదానందం, సాంబయ్య పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

రాయపర్తి: మండలంలోని జేతురాంతండా పరిధి విద్యానగర్ తండాకు చెందిన జాటోత్ వెంకన్న అనారోగ్యంతో వరంగల్‌లోని ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన వెంకన్నను ఆదుకునేందుకు బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ద్వారా ఆయన ప్రతినిధులతో శనివారం రూ. 5 వేలు అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు భూక్యా సురేందర్, జాటోత్ అనిల్, నేతావత్ శ్రీధర్, జాటోత్ వీరన్న పాల్గొన్నారు. అంతేకాకుండా మైలారం గ్రామానికి చెందిన వంగ సాగర్ అనారోగ్యంతో బాధపడుతుండగా పద్మశాలీ సంఘం నాయకులు సాగర్‌కు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు బండ యాదగిరి, మామిండ్ల సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రత కోసం సఖీ సెంటర్లు

ఖానాపురం, జనవరి 18: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలు, బాలికల రక్షణ, భద్రత కోసమే సఖీ సెంటర్లు నిర్వహిస్తున్నాయని వరంగల్ సఖీ కేంద్రం నిర్వాహకురాలు స్వప్న అన్నారు. మంగళవారిపేటలో గ్రామైక్య సంఘాల మహిళా సభ్యులతో శనివారం మహిళా, శిశు, దివ్యాంగులు, వృద్ధులకు సఖీ సేవలపై అవగాహన కల్పించారు. సఖీ సెంటర్లలో మహిళలకు కౌన్సెలింగ్, పోలీస్ సహాయం, తాత్కాలిక వసతి ఏర్పాటు చేస్తున్నట్లు స్వప్న తెలిపారు. ఆపదలో ఉన్న మహిళలు, బాలికలు 181, 100, 1098, 14567 టోల్‌ఫ్రీ నంబర్లను ఉపయోగించుకోవాలని సూచించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

కావలెను
★వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ & ఇండస్ట్రీ లో పనిచేయుటకు కంప్యూటర్ MS OFFICE, WORD, EXCEL ఆపరేటింగ్ లో డిగ్రీ అర్హతతో తెలుగు & ఇంగ్లీష్ TYPE Writing లో అనుభవం కలిగిన మహిళలు/ పురుష అభ్యర్థులు మరియు ఆఫీసులో పనిచేయుటకు ఆఫీస్ బాయ్స్ అర్జెంటుగా కావలెను. సంప్ర :9866160555
NTW-326584

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
SepTeK
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-326545

PLOTS FOR SALE
★Hyd. హయత్ నగర్, పెద్ద అంబర్‌పేట్, కొహెడ శ్రీమిత్ర, బాటసింగారం, తూప్రాన్‌పేట్, పోచంపల్లి శ్రీమిత్రలో ప్లాట్లు కొనబడును. No Brokers. 9553973999 / 6303049720.
NT-326614

వృద్ధాశ్రమము



★హన్మకొండ వడ్డెపల్లి నందు ఆధునిక వసతులతో గత పది సంవత్సరాల నుండి 50 మంది వృద్ధులకు సేవలు అందిస్తూ నూతనంగా బ్లాకు అందుబాటులోకి తేవడం జరిగింది. సంప్ర: సెల్: 9848444020, 9110551507
NTW-326547

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANAGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777135
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565